క్లుప్తంగా

నవల ముఖచిత్రం ఆవిష్కరణ



నవల ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సఖినేటిపల్లి: వీవీ మెరకకు చెందిన శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ రాసిన నవల 'రెక్కలు తెగిన స్వప్నం' ముఖ చిత్రాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఆవిష్కరించారు. ఈ వివరాలను ప్రతాప్ మీడియాకు చెప్పారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో ఈ కా ర్యక్రమం జరిగింది. ఈ నెల 12న అమలాపురంలో నిర్వహించనున్న జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా కలెక్టర్‌ను ఆహ్వానించామని ప్రతాప్ తెలిపా రు. అనంతరం కలెక్టర్‌ను ఆయన సత్కరించారు.

ఏఈ సేవలు అభినందనీయం



ఏఈ సతీష్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మలికిపురం: ఏపీ ఈపీడీసీఎల్ మండల ఏఈ మద్దూరి సతీష్ సేవలు అభినందనీయమని నవోదయ ఎలక్ట్రికల్, ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపాక చిన్ని అన్నారు. ఇటీవల ఉత్తమ ఏఈ అవార్డు పొందిన సతీష్‌ను అసోసియేషన్ ఆధ్వర్యాన మలికిపురంలో గురువారం ఘనంగా సన్మానించారు.

ఉత్సాహంగా సైన్స్ మేళా



నమూనా ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మలికిపురం: జాతీయ సైన్స్ వారోత్సవాల్లో భాగంగా విశ్వేశ్వరాయపురం వివేకానంద విద్యా సంస్థలో గురువారం సైన్స్ మేళా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు వివిధ నమూనా ప్రాజెక్టులు ప్రదర్శించారు. పాఠశాల, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తించిన గోధుమ తాచు



అంబాజీపేటలో హల్‌చల్ చేసిన గోధుమ త్రాచు

అంబాజీపేట: స్థానిక వెంకట్రాజు ఆయిల్ అండ్ ఫ్లోర్‌మిల్ ఆవరణలో జాన గణేష్‌కు చెందిన సాయిసత్య ప్లాస్టిక్ ఇండస్ట్రీలో గురువారం గోధుమ తాచుపాము హల్‌చల్ చేసింది. సంచుల కట్ట కింది భాగంలో గోధుమ తాచు ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆ పామును పట్టుకుని డబ్బాలో బంధించారు.

అతి వేగం.. అనర్థం

- రోడ్లపై నిర్లక్ష్యంగా దూసుకుపోతున్న మైనర్లు, యువకులు
- ప్రాణాలు హరిస్తున్న బైక్ డ్రైవింగ్
- తల్లిదండ్రులకు తప్పని కడుపుకోత

ఇంటర్మీడియెట్ చదువుతున్న 17 సంవత్సరాల ముగ్గురు బాలలు ఒకే బైక్‌పై గత నెల 26న అమలాపురం వెళ్తున్నారు. అయినవిల్లి మండలం నేదునూరు పెదపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో వీరిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇద్దరూ సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే. ఆ పిల్లలు బాగా చదువుకుని, భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకుని, మంచి ఉద్యోగాలు సాధించి, తమను ఉద్ధరిస్తారనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు ఈ ప్రమాదంతో ఆవిరైపోయాయి. ఇలా అతి వేగం కారణంగా ఎంతో మంది బాలలు, యువకులు తమ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చి పోతున్నారు.



నేదునూరు పెదపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాలలు (ఫైల్)

కొత్తపేట: కొన్నేళ్లుగా మోటార్ బైక్‌ల వినియోగం పెరిగిపోయింది. తగినంత ఆర్థిక స్తోమత లేకపోయినా నిత్య ప్రయాణ, వ్యాపార అవసరాల రీత్యా పలువురు ఫైనాన్స్ కంపెనీల రుణ సహకారంతో మోటార్ సైకిళ్లు కొనుగోలు చేస్తున్నారు. తగినంత వయసు, డ్రైవింగ్ అనుభవం లేకపోయినా వారి పిల్లలకు కూడా అనేకమంది మోటార్ బైక్‌లు ఇచ్చేస్తున్నారు. వారు ఆ బైక్‌లపై వీధులతో పాటు ప్రధాన రహదారుల్లో సైతం రివ్వుమంటూ దూసుకుపోతున్నారు. మా అబ్బాయి అప్పుడే బైక్ నడిపేస్తున్నాడు అంటూ ఆ తల్లిదండ్రులు ఎంతో మురిసిపోతూంటారు. అంతా బాగా ఉన్నంత కాలం ఫరవాలేదు. దురదృష్టవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగితే ఆ తల్లిదండ్రులకు కడుపుకోత. ఇటీవల ఎంతో మంది మైనర్లు, యువకులు నిర్లక్ష్యంగా, అతి వేగంగా బైక్‌లు నడిపి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీనిని అదుపు చేయడానికి పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

వాహనం నడపాలంటే..

- మోటారు వాహనాల చట్టం-1988, సెక్షన్ (4) ప్రకారం.. 18 ఏళ్ల లోపు వయసున్న ఏ వ్యక్తీ బహిరంగ ప్రదేశాల్లో మోటార్ వాహనం నడపరాదు.
- తల్లిదండ్రుల అనుమతితో 16 సంవత్సరాల వయసు దాటిన వారు 50 సీసీకి మించని ఇంజను సామర్థ్యం కలిగిన గేర్లు లేని మోటార్ సైకిల్ లైసెన్స్ పొందవచ్చు.
- ఇరవై ఏళ్ల లోపు వ్యక్తులు ఏ బహిరంగ ప్రదేశంలోనూ రవాణా వాహనం నడపరాదు.

తల్లిదండ్రులపై కేసులు

- మైనర్లకు, లైసెన్సులు లేనివారికి మోటారు వాహనం నడపడానికి ఇచ్చినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగి, ఎవరైనా మరణిస్తే.. ఆ వాహన యజమాని, తల్లిదండ్రులు, గార్డియన్లపై ఐపీసీ 304 సెక్షన్ కింద కేసు నమోదు చేస్తారు.
- ప్రమాదంలో ఎవరైనా గాయపడటానికి కారణమైతే ఆ వాహన యజమాని, తల్లిదండ్రులు, గార్డియన్లపై ఐపీసీ 308 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తారు.
- ఐపీసీ 304 సెక్షన్ కింద 10 సంవత్సరములు, 308 కింద ఏడేళ్లు శిక్షార్హులవుతారు.

18 కేసుల నమోదు

జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మైనర్ల మోటార్ బైక్స్ డ్రైవింగ్‌కు సంబంధించి గత నెల 27న జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 18 మంది తల్లిదండ్రులు, గార్డియన్లు, మోటార్ బైక్ యజమానులపై కేసులు నమోదు చేశారు. రాజోలు సర్కిల్ పరిధిలో 11, రావులపాలెం సర్కిల్‌లో 5, పి.గన్నవరం సర్కిల్ పరిధిలో 2 చొప్పున కేసులు నమోదు చేశారు.

పిల్లలను నియంత్రించాలి



పిల్లలపై నియంత్రణ లేకుండా వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు పరోక్షంగా కారణమవడంపై తల్లిదండ్రులు ఆలోచన చేయాలి. లైసెన్స్, తగిన వయసు లేకుండా విచ్చలవిడిగా, వేగంగా బైక్‌లు నడుపుతూ ప్రమాదాలకు కారణమయ్యే ఘటనలు మా దృష్టికి వచ్చినా, మా కంట పడినా కేసులు నమోదు చేస్తాం. దీనిని తల్లిదండ్రులు గమనించాలి. చట్టాన్ని గౌరవించాలి. పిల్లల్ని నియంత్రణలో పెట్టాలి.

– శి.మణికుమార్, ఎస్సై, కొత్తపేట

పంట చేల పరిశీలన



లూటుకుర్రులో పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

మామిడికుదురు: పంట పొలాలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ లూటుకుర్రు రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో అధికారులు గురువారం ఆ గ్రామంలో పర్యటించారు. తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఏఓ బి.మృదుల, ఇరిగేషన్ వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌లు పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. మానేపల్లి చానల్ నుంచి మూడు రోజులకు ఒకసారి వంతుల వారీగా సాగునీరు విడుదల చేస్తామని ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు. కాలువలో ప్రస్తుతం అడుగున్నర మేర సాగునీరు ఉందని, ఆ నీటినే పంట బోదెలకు అందిస్తున్నామని చెప్పారు. పంట కాలువలకు అడ్డుకట్టలు వేసి, నీటిని చౌర్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ సభ్యుడు నామన వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓపై కేసు

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామ సచివాలయం-1 వీఆర్‌ఓ పసుపులేటి సత్యధనలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 25న సచివాలయంలో జలజీవన్ మిషన్ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఓ స్థలం విషయమై వీఆర్‌ఓను ఉప సర్పంచ్ బొంతు శ్రీను, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రశ్నించారు. దీనికి వివరణ ఇవ్వకపోగా ఆమె తమను నానా దుర్భాషలూ ఆడిందని, రెవెన్యూ సంఘంలో పెట్టి తమ అంతు చూస్తామంటూ బెదిరించారని ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

సఖినేటిపల్లి: అమలాపురం బైపాస్ రోడ్డులో గత నెల 27న జరిగిన బైక్ ప్రమాదంలో అంతర్వేదిపాలేనికి చెందిన ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబ సభ్యులను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం పరామర్శించారు. నాటి ప్రమాదంలో గ్రామానికి చెందిన బొమ్మిడి నరసింహం అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వాతాడి నరసింహస్వామి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వారి కుటుంబాలకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.

నాయకులకు పరామర్శ

పి.గన్నవరం: ఇటీవల అనారోగ్యానికి గురై కోలుకుంటున్న పి.గన్నవరానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అడ్డగళ్ల వెంకట సాయిరామ్‌ను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం పరామర్శించారు. అలాగే అనారోగ్యానికి గురై కోలుకున్న పార్టీ నాయకులు ఉలిశెట్టి బాబీ, నాగాబత్తుల రత్నంలను కూడా పరామర్శించారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాలి

పి.గన్నవరం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, పి.గన్నవరం, ఎల్.గన్నవరం గ్రామాల్లో జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు అధ్యక్షతన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ, ఈ నెల 18 నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, దొమ్మేటి పార్వతి, టీవీవీ సత్యనారాయణ, ఎన్.ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు కొల్లే సూర్యనారాయణ, దాసరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ప్రభుత్వ లక్ష్యం మేరకు సచివాలయ సేవలు

కొత్తపేట: ప్రభుత్వ లక్ష్యం మేరకు సచివాలయాల పరిధిలో సేవలందించాలని డీఎల్‌డీఓ పి.విజయ థామస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. వాడపాలెం-1, 2 సచివాలయాలను గురువారం సందర్శించిన ఆయన కార్యదర్శులు, సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. సచివాలయ సేవలను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరాలని, ఏవైనా సాంకేతిక లోపాలతో అందకపోతే వాటిని సరి చేయాలని సూచించారు. వలంటీర్లతో సహా ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. గ్రామంలో సామాజిక పింఛన్లు ఎన్ని ఉన్నాయి, ఈ రెండు రోజుల్లో ఎంతమందికి పంపిణీ చేశారు అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. సుస్థిర అభివృద్ధి ప్రణాళిక, డేటా అప్‌డేషన్, సమన్వయం వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాడపాలెం సచివాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎల్‌డీఓ థామస్

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

రాజోలు: కాలి శస్త్రచికిత్స కోసం చింతలపల్లికి చెందిన మామిడిశెట్టి నాగేశ్వరరావుకు గల్ఫ్ యువసేన సేవా సమితి రూ.15 వేల ఆర్థిక సాయం అందించింది. ఈ మొత్తాన్ని రాష్ట్ర సెడ్క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ గురువారం అందజేశారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పాశర్లపూడి శ్రీపోళ్ళమ్మ ఆలయం వద్ద గురువారం వీరభద్రస్వామి సంబరం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ స్వామి వారిని ఉదయం మేల్కొలిపారు. అనంతరం వైనతేయ గోదావరి వరకూ ఊరేగింపుగా వెళ్లారు. నదీ స్నానంతో పాటు పలు పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం శమీ పూజ నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన శ్రీ షిర్డీ సాయి భక్తి రంజని ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామి వారి భక్తులు 60 గజాల పొడవైన నిప్పుల గుండం తొక్కారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో నిత్యాన్నదానం ట్రస్టుకు పినిశెట్టి నాగేశ్వరరావు, నాగదుర్గ దంపతులు (హైదరాబాద్) గురువారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు ఈ విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్ పాల్గొన్నారు.

6న హుండీల లెక్కింపు

శ్రీ బాలబాలాజీ స్వామి వారి హుండీల ఆదాయం లెక్కింపు సోమవారం జరుగుతుందని ఈఓ నాగవరప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రజాప్రతినిధులు, ట్రస్టు బోర్డు సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

పి.గన్నవరం: మండలంలోని జి.పెదపూడి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం శుక్రవారం జరగనుంది. దీనిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వైఎస్సార్ సీపీ నేత మంతెన రవిరాజు తెలిపారు. రాత్రి 8 గంటలకు ప్రముఖ సింగర్లు రేవంత్, శ్రావణ భార్గవి, రమణ, సాయిశిల్ప తదితరులతో సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో కండక్టర్ ఝాన్సీ, నెల్లూరు కవిత టీములు పాల్గొంటాయని తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

సఖినేటిపల్లి: మోరి గ్రామంలో మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర గురువారం రాత్రి వైభవంగా జరిగింది. అమ్మవార్లకు ఉదయం చలిమిడి, పానకాలు నివేదించారు. సాయంత్రం ఆలయం వద్ద కాగడాల నివేదన చేశారు. మోరిపోడుకు చెందిన ఆకుల కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో రాత్రి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తివేషాలు, దేవతామూర్తుల నృత్య ప్రదర్శనలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు, వాయిద్యాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి.

బాలికల రక్షణకు అందరూ కృషి చేయాలి

ఆలమూరు: బాలికల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తపేట డివిజన్ అదనపు వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమం జరిగింది. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సువర్చలా నాయుడు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. బాలికలపై హింస నివారణకు తీసుకోవలసిన చర్యలు, అండగా ఉండాల్సిన విధానాలను వైద్య, ఆరోగ్య అధికారులు సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్‌ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్.బేబీ తదితరులు క్షుణ్ణంగా వివరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ తీవ్రమైన నేరమని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, బాలికా శిశు మరణాలను నివారించాలని సూచించారు.



బాలికల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బ్రహ్మేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

అంబాజీపేట: చిరతపూడి గ్రామంలోని శ్రీ పార్వతీ బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు కొత్తలంక కొండలరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యాన స్వామి వారికి అభిషేకాలు, లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామల పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. జ్వరాల బారిన పడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేయాలన్నారు. సమావేశంలో వక్కలంక సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైద్యాధికారులు ఎ.ఇంద్రావతి, జీవీ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

బీమాతో కుటుంబానికి భరోసా

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవడం వల్ల ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని జీవిత బీమా సంస్థ శాటిలైట్ కార్యాలయ మేనేజర్ కె.లలితకుమార్ అన్నారు. జీవిత బీమా సంస్థ ఆవశ్యకతను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఆయన వివరించారు. పొదుపు అవసరంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పాడి-పంట

ఎరువులు పరిమితంగానే వాడాలి

ఆత్రేయపురం: సాగులో పరిమిత స్థాయిలోనే ఎరువులు, పర్యావరణ హిత పురుగు మందులు వాడాలని రైతులకు వ్యవసాయ శాఖ స్థానిక సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకట రామారావు సూచించారు. మండలంలోని వెలిచేరు, వద్దిపర్రు, రాజవరం, పేరవరం గ్రామాల్లో 185 మంది రైతులకు చెందిన 250 ఎకరాలను గేప్ సాగుకు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ మొత్తం విస్తీర్ణంలో ఎంటీయూ-1121 రకం వరి సాగు చేయగా, సంబంధిత రైతులకు మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రతి గురువారం పొలంబడి నిర్వహిస్తున్నారు. ఏడీఏ వెంకట రామారావు, పెద్దాపురం డాట్ సైంటిస్ట్ ఎస్.నరసింహారావు కలసి ఈ వారం 10 చోట్ల పొలంబడి నిర్వహించారు. వరి చేలను సందర్శించి, పురుగులు, తెగుళ్లు ఉన్నాయేమో పరిశీలించారు. పలుచోట్ల కాండం తొలుచు, ఆకుముడత పురుగులు, కాండం కుళ్లు తెగులు ఉన్నట్టు గుర్తించారు. కాండం కుళ్లు నివారణకు లీటరు నీటికి టెబుకొనజోల్ 2 మిల్లీలీటర్ల చొప్పున 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కాండం తొలుచు, ఆకుముడత పురుగుల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఎకరానికి నాలుగుచోట్ల లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రెక్కల పురుగులు కనిపిస్తే వేపనూనె పిచికారీ చేయాలన్నారు. 50 శాతం రాయితీపై ఎకరానికి అర లీటరు చొప్పున వేపనూనె పంపిణీ చేశారు. కార్యక్రమంలో గేప్ ట్రైనర్, మలికిపురం వ్యవసాయాధికారి ఆర్.రాకేష్, ఆత్రేయపురం వ్యవసాయాధికారి జె.పట్టాభిరామయ్య, వీఏఏలు, 150 మంది రైతులు పాల్గొన్నారు.



వెలిచేరులో రైతులకు వేపనూనె పంపిణీ చేస్తున్న ఏడీఏ వెంకట రామారావు



అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరి సంకరీకరణపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు



మలికిపురంలో పొలంబడిలో పాల్గొన్న రైతులు, అధికారులు

గాలిపీడనంతో పుప్పొడి వెదజల్లాలి

అంబాజీపేట: కొబ్బరి సంకరీకరణలో భాగంగా ఆడ పుష్పాలపై గాలిపీడనం ద్వారా కింద నుంచే పుప్పొడి వెదజల్లాలని, తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. కొబ్బరి సంకరీకరణపై పరిశోధన కేంద్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రెండో విడత శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, కొబ్బరి సంకరీకరణలో పొత్తుల నుంచి మగ పుష్పాలను వేరు చేయడం, బ్యాగింగ్, పరాగ సంపర్కం, పుప్పొడి జీవం, మొలక నిర్ధారణ అంశాలపై వివరించారు. హార్టికల్చర్ శాస్త్రవేత్త ఎ.కిరీటి పై అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.కోటేశ్వరరావు పుప్పొడి సేకరణ, ప్రాసెసింగ్, లేబులింగ్ యూనిట్‌తో పాటు, హెచ్ మార్కు నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కొబ్బరి చెట్టు ఎక్కడం, భూమి పై నుంచి ఆడ పుష్పాలపై పుప్పొడి గాలి పీడనం ద్వారా పాలినేషన్ చేసే విధానాన్ని వివరించారు. శిక్షణ పొందిన 20 మంది యువకులకు శ్రీనివాసులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష పాల్గొన్నారు.

చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలి

మలికిపురం: దాళ్వా సాగులో చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎస్.రాకేష్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానంలో నివారణ మార్గాలను రైతులకు వివరించారు. తద్వారా మెరుగైన దిగుబడులతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంట దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, మండలి జిల్లా సభ్యులు గుబ్బల రమేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఆలమూరు: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ ఆలమూరు సహాయ సంచాలకులు ఎల్.అనిత అన్నారు. గుమ్మిలేరులోని పశువుల ఆస్పత్రిలో వైద్యాధికారి సుభాష్‌చంద్ర ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ గుణ్ణం రాంబాబు, అనిత ప్రారంభించారు. సుమారు 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

అంబాజీపేట: నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారులు డి.రాజేంద్ర, బి.శ్రీనివాస్ పాడి రైతులకు విజ్ఞప్తి చేశారు. మాచవరం, పసుపల్లి గ్రామాల్లో టీకాల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 400 పైగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని చెప్పారు.